క్లుప్తంగా

ఆధార్ క్యాంపులు ఏర్పాటు

వత్సవాయి:మండలంలోని భీమవరం, మంగొల్లు, వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వతేదీన వత్సవాయి, మంగొల్లు, 23, 24వతేదీల్లో భీమవరంలో, 23న దబ్బాకుపల్లి, 24న పోలంపల్లి ఆధార్‌క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ క్యాంపులను ఆయా గ్రామాల ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

నేడు వత్సవాయిలో ప్రజావేదిక

వత్సవాయి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై మంగళవారం సోషల్ ఆడిట్ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నంబూరి రాంబాబు సోమవారం తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి మార్చి 31వ తేదీ 2024వరకు ఏడాది కాలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు ఈ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రజావేదిక కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 15అర్జీలు



నందిగామటౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ బాలకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోరుతూ 14 అర్జీలు, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు ఆర్డీఓ తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడులో జనసేన ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ సౌజన్యంతో దివ్యాంగులకు ఆదివారం రాత్రి ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పాల్గొని ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన గ్రామంలో ఏర్పాటు చేసిన ఆపార్టీ జెండాదిమ్మెను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బాడిశ మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి చింతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నండూరి రాధిక పర్యవేక్షణలో సుమారు 20 మంది చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు వారికి దేవస్థానం తరుపున ప్రసంసాపత్రం, అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

గోశాలకు వరిగడ్డి వితరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం గోశాలలో గోవులకు తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం గొండ్రియాల గ్రామానికి చెందిన బండ్ల కృష్ణారావు 70 వరిగడ్డి కట్టలు ఉచితంగా అందజేశారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దాతను అమ్మవారి ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, సిబ్బంది శశి పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో సిద్ధాంత పండిత సభ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ కంచి కామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ ఆదేశానుసారం ఈ నెల 25, 26వ తేదీల్లో గుంటూరు జిల్లా కొలనుకొండలోని కంచి కామకోటిలో సిద్ధాంత పండిత సభను నిర్వహించనున్నట్లు కంచికామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రధానంగా ఉత్తరాయణ ఆరంభ నిరూపణం అనే అంశంపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ముంబై తదితర రాష్ట్రాల నుంచి కొందరు ప్రత్యక్షంగానూ, మరికొందరు ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటారని తెలిపారు. జ్యోతిష్య ఖగోళ పరిశోధనలపై ఆసక్తి కలిగిన పండితులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి కోరారు. పూర్తి వివరాలకు 99637 32303 నంబరులో సంప్రదించాలని సూచించారు.



రామచంద్రునిపేటలో అంతుచిక్కని వైరస్‌తో కుళ్లిన మిర్చి పంట



ఎండిపోయిన మిరప మొక్క

మిర్చిపంటకు అంతుచిక్కని వైరస్

- ఎండిపోతున్న మిరప మొక్కలు
- పట్టించుకోని ఉద్యానవనశాఖ అధికారులు
- ఆందోళనలో రైతులు

జగ్గయ్యపేట: మిరప తోటలకు అంతుచిక్కని వైరస్ సోకి పంట ఎండిపోతుండటతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. జగ్గయ్యపేట మండలంలోని రామచంద్రునిపేట, గరికపాడు, తక్కెళ్లపాడు, పోచంపల్లి, షేర్ మహ్మద్‌పేట గ్రామాల పరిధిలో రైతులు సుమారు రెండు వేల ఎకరాలలో రైతులు మిర్చి సాగు చేపట్టారు. అయితే కొద్దిరోజులుగా మిర్చిపంట ఎండిపోతోంది. కాయ కుళ్లి ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టి పంట సాగు చేయగా, పంట చేతికొచ్చే సమయంలో మిర్చితోటలు అంతుచిక్కని వైరస్ బారినపడి పంట దెబ్బతింటోందని రైతులు చెబుతున్నారు.



ఎండిపోయిన పంటను చూపిస్తున్న బాధిత రైతులు

ఈ వైరస్ కారణంగా మిరప మొక్క ఆకులు ఊడిపోతున్నాయని ఈ వైరస్‌ను మునుపెన్నడూ చూడలేదంటున్నారు. సమస్యను గుర్తించి నివారణ చర్యలను సూచించాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు, గరికపాడు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కనీసం ఈ వైపు తొంగి చూడకపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు కంటతడి పెడుతున్నారు. ఇకనైనా ఉద్యానవనశాఖ అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుని నష్టాల బారి నుంచి తమను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు

కంచికచర్ల: రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అధికారులతోపాటు ప్రజలు కృషి చేయాలని స్వర్ణ టోల్‌ప్లాజా సీఓఎం రాజారావు అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని వాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈ మేరకు సీఓఎం మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు, జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు వాహన డ్రైవర్లకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదన్నారు. కారు నడిపే ప్రతిఒక్కరూ సీటుబెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలోఎన్‌హెచ్‌ఏఐ సేఫ్టీ అధికారి శ్రీనివాస్, ప్లాజా మేనేజర్ జయప్రకాష్, సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.



కీసర టోల్‌ప్లాజా సమీపంలో ఆటోకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న ప్లాజా సీఓఎం రాజారావు

కత్తులతో వీరంగం సృష్టించడంపై ఫిర్యాదు

పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడులో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు ఇంటివద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు కత్తులతో వీరంగం సృష్టించారు. ఈ విషయంపై భాస్కరరావు వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన దోసపాటి చరణ్, కోట చరణ్ అనేవ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి భాస్కరరావు ఇంటి ఆవరణలోకి ప్రవేశించి తలుపులు కొడుతూ తీవ్రమైన దుర్భాషలతో బయటకు రారా నీసంగతి తేలుస్తామంటూ కేకలు వేసి వీరంగం చేశారు. దీంతో భాస్కరరావు దంపతులు బిగ్గరగా అవరడంతో చుట్టుపక్కలు వారు అక్కడకు చేసుకున్నారు. ఆ సమయంలో భాస్కరరావు ఇంటి తలుపులు తీసుకుని బయటకు రాగా పైవారలు దాడికి ప్రయత్నించారు. భాస్కరరావుతోపాటు స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా బెదిరింపులకు పాల్పడుతూ అక్కడ్నుంచి పారిపోయారు.



ఏఎస్ఐ నాగేశ్వరరావుకు ఫిర్యాదు అందిస్తున్న భాస్కరరావు, పక్కన వేల్పుల రవికుమార్

ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిద్దరిపై కఠినచర్యలు తీసుకోవాలని భాస్కరరావు తన ఫిర్యాదులో పోలీసులను కోరారు. పోలీసులను కలిసి భాస్కరరావుకు న్యాయం చేయాలని కోరిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, యానాల సురేష్, బత్తుల వెంకటనర్సు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

జగ్గయ్యపేట: ఎరువులు అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు ఏడీఏ కెనడీ హెచ్చరించారు. మండలంలోని అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని వెంకట శివరామకృష్ణ ట్రేడర్స్, శ్రీలక్ష్మీ ఫెర్టిలైజర్స్ దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. దుకాణదారులు స్టాకు బోర్డులు ఏర్పాటు, లైసెన్సులు, స్టాకు రిజిస్టర్, బిల్ పుస్తకాలతోపాటు బయో స్టిములేషన్‌కు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు ప్రభుత్వ ధరలకనుగుణంగా ఎరువులు, పురుగు మందులు విక్రయించడంతోపాటు రశీదులు అందించాలని తెలిపారు. తనిఖీల్లో ఏవో వరలక్ష్మి పాల్గొన్నారు.



రిజిస్టర్‌లు పరిశీలిస్తున్న ఏడీఏ కెనడీ

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



కంచికచర్ల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పి.జాహ్నవి



పెట్రోలు నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్ జాహ్నవి, ఆర్‌ఐ వెంకట్

తహసీల్దార్ జాహ్నవి

కంచికచర్ల: ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు సరైన వైద్యసేవలు అందించడంతోపాటు తగిన సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ పి.జాహ్నవి వైద్యసిబ్బందికి సూచించారు. లేనిపక్షంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీ, పెట్రోలు బంక్, సినిమా థియేటర్లను సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పీహెచ్‌సీలోని రికార్డులను తనిఖీ చేశారు.ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులతో ఆరోగ్య సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. రాత్రి సమయాల్లో కూడా ఆరోగ్య సిబ్బంది పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం ఆమె స్థానికంగా ఉన్న పెట్రోలు బంక్‌లను పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు నాణ్యమైన పెట్రోలును అందించాలన్నారు. కల్తీకి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పెట్రోలు బంకుల్లో వాహనదారులకు తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం ఆమె సినిమా థియేటర్లను పరిశీలించి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని యాజమాన్యాలను ఆదేశించారు. థియేటర్లలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన ప్రమాద నివారణ చర్యలు పాటించాలన్నారు.. సిట్టింగ్ మేరకే టికెట్లు విక్రయించాలని, అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రేక్షకులకు తగిన వసతులు కల్పించాలన్నీరు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ వెంకట్, వీఆర్వో బ్రహ్మం తదితరులు ఉన్నారు.

ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లకు డిమాండ్

జగ్గయ్యపేటఅర్బన్: ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని జాతీయ సోషలిస్ట్ కూటమి నేత ఎల్.జైబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ గుర్రం సుబ్బారావు నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ అమలుచేస్తే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఈ అంశంపై పార్లమెంటు చట్టం చేస్తే దేశంలో 10 కోట్ల మందికి ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాలు న్యాయ రక్షణలు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీత భత్యాలు, నూతన పెన్షన్ విధానం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రైవేటు రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సోషలిస్ట్ కూటమిఈనెల 24న మంగళగిరి నుంచి దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. సోషలిస్ట్ కూటమి రాష్ట్ర అధికారప్రతినిధి పాదిలి వెంకట్రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాళ్లూరి జైదుర్గ, సమతా సైనికదళ్ రాష్ట్ర అధ్యక్షుడు యేసుపోగు నాగేశ్వరరావు, ఎంసీపీఐ రాష్ట్ర నాయకుడు కాకాని గణేష్, ఆకివీటి సునిల్, కోట ప్రభూజీ, అన్నెపాగ దుర్గారావు,వేమవరపు అర్లయ్య, గోపి వెంకటరత్నం, నటుకుల రవి పాల్గొన్నారు.

మధురంగా సాగిన గాత్ర కచేరి

విజయవాడ కల్చరల్: గోమయి నాదమయి ట్రస్ట్ ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో సోమవారం చెన్నైకి చెందిన యువ సంగీత విద్వాంసుడు డాక్టర్ ఆర్. సూర్యప్రకాష్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత మూర్తిత్రయం శ్రీ సద్గురు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి రచించిన కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై పప్పు జయదేవ్, మృదంగంపై పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, కంజీరాపై కె. శ్రీనివాస్ సహకరించారు. ట్రస్ట్ సభ్యుడు వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి సంగీత విద్యాంసుడు సూర్యప్రకాష్ గురించి మాట్లాడుతూ ఎనిమిది ఏళ్ల వయస్సు నుంచే సంగీత సాధన ప్రారంభించారని.. విఖ్యాత సంగీత విద్వాంసుడు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ నుంచి గానకళామధుర, తమిళనాడు ప్రభుత్వం నుంచి కలైలామణి, మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వారి నుంచి ఉత్తమ సంగీత విద్వాంసుడు బిరుదు పొందినట్లు తెలిపారు. మరొక నిర్వాహక సంఘ సభ్యుడు జె.ఎస్. దక్షిణామూర్తి సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్, మల్లాది సూరిబాబు, మల్లాది కార్తీక త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



కచేరి నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్. సూర్యప్రకాష్‌రావు


నిబంధనలు పాటించకుంటే చర్యలు : ఎస్‌ఐ

పెద్దాపురం(వీరులపాడు):ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామసమీపంలో సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అనిల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు పరిమితి మేరకే ప్రయాణికులను ఎక్కించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న చలానాలను వసూలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని, సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు .

విద్యాభివృద్ధికి కృషి : డీవైఈఓ

నందిగామటౌన్: విద్యావ్యవస్థ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీవైఈఓ సాంబశివరావు తెలిపారు. డీవైఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనను యూటీఎఫ్ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా డీఈవైఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడటంతోపాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం యూటీఎఫ్ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బెనర్జీ, నరసింహారావు, రామారావు, సత్యనారాయణ, మహేశ్వర వెంకటేశ్వరరావు, గంగరాజు, జక్కనాచార్యులు, యలమందయ్య, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ ద్వారా ఉపాధి అవకాశాలు



నందిగామటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సోమవారం తెలిపారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. 21 నుంచి 24ఏళ్ల వయసు వారిని గుర్తించి దేశంలోని అగ్రశ్రేణి కంపెనీల్లో 12 నెలల పాటు శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇందుకోసం పదోతరగతి ఉత్తీర్ణులైన వారు ఆయా సచివాలయాల పరిధిలో ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. శిక్షణా కాలంలో రూ. ఆరువేలు స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. నందిగామ పట్టణంలో ఒక్కో సచివాలయ పరిధిలో 10మంది చొప్పున 100మంది నిరుద్యోగులకు శిక్షణనిచ్చి, ఉపాధి కల్పిస్తామని ఆయన వివరించారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి



విజయవాడస్పోర్ట్స్: జాతీయ పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించాలని రాష్ట్ర జూడో క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. మహారాష్ట్రంలోని పూణెలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే క్యాడెట్ జాతీయ జూడో క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర స్త్రీ, పురుషుల జట్లకు శాప్ కార్యాలయంలో సోమవారం ఆయన కిట్లను అందజేశారు. పురుషుల జట్టులోని పి.రాజు, వై.రాజు, ఇ.సంతోష్, పి.దివాకర్‌రెడ్డి, ఎల్.రామ్‌చరణ్, టి.సంతోష్, ఎ.ఎల్.పవన్‌కుమార్, ఇ.రిషి, మహిళల జట్టులోని ఎన్.జాహ్నవి, కె.సౌమ్య, బి.మేఘన, డి.యశస్విని, ఎస్.వెన్నెల, ఆర్.జాన్సీ, బి.భావన, ఎం.సాయిహర్షితలకు అభినందనలు తెలిపి జాతీయ పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర జూడో సంఘం సీఈవో నామిశెట్టి వెంకట్, అధ్యక్ష కార్యదర్శులు గణేష్ సుబ్బారావు, పవన్‌సందీప్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఉషారాణి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థినికి సత్కారం

జగ్గయ్యపేట అర్బన్: పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించి ఇడుపులపాయట్రిపుల్ ఐటీలో సీటుసాధించిన విజ్ఞాన్ విద్యాసంస్థల విద్యార్థిని మూడావత్ వెన్నెలను పాఠశాల కరస్పాండెంట్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సోమవారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో తన్నీరు మాట్లాడుతూ విద్యార్థిని మూడావత్ వెన్నెల కష్టపడి చదివి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటూ ఆశీర్వదించారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ ప్రతిఏటా తమ విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నారన్నారు. తమ సంస్థ ఎన్‌సీసీ విభాగాన్ని కూడా కలిగిఉండటం ద్వారా ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక సీట్లు సాధించడం మరింత సులువు అవుతోందని వివరించారు.



మూడావత్ వెన్నెలను అభినందిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, సుధారాణి

శాప్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. ఏపీ క్రీడాభివృద్ధి సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరిషాను విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యే తాతయ్య సోమవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పేటలోని స్విమ్మింగ్‌పూల్‌ను మున్సిపాలిటీకి ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పేటలోని రెండు క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, విజయవాడలోని ఈఈపీహెచ్ స్వామినాయుడును కలిశారు. విలియంపేటలో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధ, కౌన్సిలర్ వెంకట్, నోముల రఘు ఉన్నారు.



శాప్ చైర్మన్‌ను కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత..

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలిసి నియోజకవర్గంలోని ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీలింగ్ భూములు, స్కిల్‌సెంటర్ ఏర్పాటు, డీఎంఎఫ్ ఫండ్స్ విడుదల, డంపింగ్‌యార్డు స్థలం మార్పు తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన వివరించారు.

త్యాగరాజ స్వామికి సప్తస్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పడమట దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. సోమవారం కార్యక్రమాలు హరిద్రా మ్యూజిక్ అకాడమీ బృందం, పామర్తి కార్తీక, విజయనగరానికి చెందిన చొప్పల్లి సంతోష్‌కుమార్, భాగవతుల వంశీకృష్ణ శివాత్మిక, హైదరాబాద్‌కు చెందిన పూడిపెద్ది రాధాకృష్ణ, నోరి సోదరీమణులు, మల్లాది కార్తీక త్రివేణి, తుషార పూర్ణవల్లి తదితరులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. యువ సంగీత కళాకారుడు ఎస్.వనమాలి వేణువుపై త్యాగరాజ స్వామి రచించిన శ్రీగణనాథం, నిరవది సుఖదా, మారవైరి, నీవల్లగుణదోషమేమి తదితర కీర్తనలు పలికించారు. వయోలిన్‌పై సుబ్రహ్మమణ్యరాజు, మృదంగంపై వినుష్ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు యనమండ్ర శ్రీనివాస శర్మ, యనమండ్రవేణు గోపాలశాస్త్రి పర్యవేక్షించారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి. బాల గంగాధర్ 38వ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో బాలగంగాధర్ అభినందన కార్యక్రమం జరిగింది. రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పలు పతకాలు సాధించిన బాలగంగాధర్ జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి కళాశాల పేరు ప్రఖ్యాతలు ఇనుమడింప చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ఆకాంక్షించారు. అనంతరం కళాశాల సిబ్బందితో కలిసి బాలగంగాధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ డి. యుగంధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.